క్లుప్తంగా

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్లటౌన్: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. పట్టణంలోని 2, 14వ వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం సందర్శించారు. శ్రీనగర్‌కాలనీ నుంచి చంద్రంపేట చౌరస్తా వరకు నిర్మిస్తున్న 60 ఫీట్ల సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. శాంతినగర్ మీదుగా ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువను, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు రాపెల్లి దినేశ్, అడ్డగట్ల మాధవి, ఈఈ ప్రసాద్, ఏఈ వెంకటేశ్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్ల కుర్మల కులదైవం మల్లికార్జున స్వామి సహిత గొల్లకేతమ్మ, మేడాలమ్మ కల్యాణ వేడుకల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు లగిశెట్టి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

కోనరావుపేట: మండలం బావుసాయిపేటలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని యాదవ, కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాగవెల్లి, అగ్ని గుండాలు తొక్కడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెంద గంగాధర్, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, కుర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జీల పాలన ఎన్నాళ్లు..?

- కొత్త మండలానికి అధికారులు కరువు
- ఇబ్బందుల్లో ప్రజలు
- వెనకబడుతున్న మండల అభివృద్ధి



వీర్నపల్లిలోని పెట్రోల్ బంక్ వద్ద అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ముఖ్య శాఖలు ఏళ్లుగా ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఇన్‌చార్జీలుగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై ఇతర మండలాల బాధ్యతలు ఉండడంతో మండలానికి ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో తెలియడం లేదని ప్రజలు అంటున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఇన్‌చార్జీల పాలనకు ముగింపు పలికి రెగ్యులర్ అధికారులను నియమించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు ఇవే..

ఎంపీడీవో, వ్యవసాయశాఖలో ఏవో. ఎంఈవో, ఈజీఎస్ ఏపీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో పంచాయతీ అభివృద్ధిలో కీలక పోస్టు ఖాళీగా ఉంది. అంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన భారతిని కొన్ని కారణాలతో వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు. దీంతో పోస్టు ఖాళీ కావడంతో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న నరేశ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. నరేశ్‌కుమార్‌కు రెండు బాధ్యతలు అప్పగించడంతో తలకుమించిన భారమవుతోంది.

ఏవో పోస్టు ఖాళీ

వ్యవసాయాధికారిగా భూమిరెడ్డి వీర్నపల్లి మండల ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపట్టారు. రెండు మండలాలకు సంబంధించి ఆయనకే బాధ్యతలు ఇవ్వడంతో ఒకరోజు ఇక్కడ, మరో రోజు అక్కడ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

విద్యా వ్యవస్థలోనూ అంతే..

ఉమ్మడి ఎల్లారెడ్డిపేట ఎంఈవో రాజయ్య వీర్నపల్లి మండల బాధ్యతలు తీసుకున్నారు. సంవత్సర క్రితం ఆయన అకాల మరణం చెందడంతో ఆయన స్థానంలో ఇప్పటికే ఐదు మండలాలకు ఇన్‌చార్జిగా ఉన్న దూస రఘుపతికి వీర్నపల్లి మండలానికి ఇన్‌చార్జి బాధ్యత ఇవ్వడంతో ఆరు మండలాలకు తానే ఇన్‌చార్జి కావడంతో వారానికి ఒక్కో మండలానికి ఒకసారి విజిట్ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

వైద్యాధికారి కూడా..

మండలంలోని వీర్నపల్లి, గర్జనపల్లి రెండు ఆరోగ్య ఉపకేంద్రాలు ఎనిమిది ఏళ్లుగా ఎలాంటి ప్రయోజనం లేదు కొనసాగుతున్నాయి. అలాగే ఎల్లారెడ్డిపేట వైద్యాధికారికి ఇన్‌చార్జి ఇవ్వడంతో వైద్య సేవల కోసం మండల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేక పారిశుధ్యం లోపించింది. పంచాయతీలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నాయి.

ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం



మండలం ఏర్పాటైనప్పటి నుంచి ముఖ్య శాఖల అధికారుల బాధ్యతలు ఇన్‌చార్జీలకు ఇవ్వడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికై నా అధికారులు. ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి స్థాయి అధికారులను నియమించాలి.

– తడగొండ సాయిలు, వన్‌పల్లి

అవగాహన కరువైంది



మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారి లేక ఇబ్బంది పడుతున్నం. పంటలు దెబ్బతింటే చెప్పుకుందామని ఆఫీసుకు పోదామంటే దూరమవుతుంది. ఇప్పటికైనా మండల వ్యవసాయాధికారిని నియమించాలని కోరుతున్నాం.

– పర్మాల పర్శరాములు, రైతు, వీర్నపల్లి

పూర్తిస్థాయి ప్రయత్నిస్తాం



అన్ని శాఖలల్లో ఇన్‌చార్జి పాలనా కొనసాగడం వాస్తవమే. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయి అధికారులను నియమించేలా ప్రయత్నం చేస్తాం. వీర్నపల్లి మండలంలో పర్యటించనున్నాడు. అన్ని సమస్యలు వివరించి పరిష్కరించేలా కృషి చేస్తా.

– మాలోత్ భూల, ఎంపీపీ వీర్నపల్లి

అక్రమ అరెస్టులను నిరసిస్తూ

- ఖాళీ వంట పాత్రలతో కాంగ్రెస్ ర్యాలీ
- ఠాణా ఎదుట బైఠాయింపు



తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట వంటపాత్రలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన సరిగా ఉంటే ప్రతిపక్ష నాయకులను ఎందుకు అరెస్టు చేయాల్సి వస్తుందని..? జాలగం ప్రవీణ్(టోని) ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలోని తాడూర్ చౌరస్తా నుంచి ఖాళీ వంట పాత్రలతో పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఠాణా ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోని మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఎప్పుడు పర్యటనకు వచ్చినా స్థానిక పోలీసులు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అకారణంగా అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి మాటున జరుగుతున్న దోపిడీని, అక్రమాలను ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. ఏ అభివృద్ధి పనిలోనైనా 15 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. వ్యవసాయ కళాశాల పేరుతో దళితుల భూములను తీసుకున్నారని వారికి సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కళాశాలలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, మండల రైతు అధ్యక్షుడు పొన్నాల పర్శరాములు, మండల కార్యదర్శి అరెపల్లి బాలు, యువజన నాయకులు శ్రీకాంత్, నాయకులు శ్యామ్, బాలసాని శ్రీనివాస్, చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



బోరు చుట్టూ మురుగు

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్ గ్రామంలోని చేతిబోరు చుట్టూ మురుగు నీరు చేరింది. సీసీ రోడ్డు నిర్మాణంతో నీరు బయటకు వెళ్లేందుకు వీలులేకపోయింది. దీంతో నీరు పట్టుకునేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: కళాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి, నర్సింగపూర్
సెల్ నెం: 89858 53136

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/చందుర్తి: పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జక్కుల తిరుపతి, పోంచెట్టి రాకేశ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బొమ్మడి స్వామి, బీజేపీ ఓబీసీ విభాగం సిరిసిల్ల నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకార్తి శ్రీనివాస్, మండల కో ఆర్డినేటర్ బోదాసు స్వామి, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు లక్కర్సు శశికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన నాయకులు

గంభీరావుపేట: ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్రగా బుధవారం బయలుదేరారు. కోళ్లమద్ది నుంచి ప్రారంభమైన పాదయాత్ర విగ్రహావిష్కరణ స్థలం వరకు సాగుతుందని తెలిపారు. పాదయాత్రలో బీఆర్‌ఎస్ నాయకులు ఎడబోయిన దిలీప్ కుమార్, కూడెల్లి సురేష్, గుండెల్లి మహేశ్, దేవరాజు, కూడెల్లి వెంకటేశ్ ఉన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు

సిరిసిల్లఅర్బన్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను సిరిసిల్ల బ్రాంచ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ సేవలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. బ్యాంక్ రుణాలు, గోల్డ్‌లోన్, సామాజిక భద్రత పథకాలు, తదితర సేవలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం మల్లికార్జున్, బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్ శాంతకుమార్, సిబ్బంది కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామంలో వ్యవసాయ శాఖకు చెందిన విద్యార్థులు రైతులకు పంటలు, వాటి వివరాలపై అవగాహన కల్పించారు. భాగస్వామ్య విశ్లేషణాత్మక మూల్యాంకన తులనంలో భాగంగా విద్యార్థులు బుధవారం గ్రామ రైతులకు వాటిపై చిత్రపటాలు వేసి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పండుగ తిరుపతి, రైతుబంధు కోఆర్డినేటర్ ఎల్లాల దశరథరెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, ఏఈవో సందీప్ పాల్గొన్నారు.

కోనరావుపేట తహసీల్దార్‌గా రవికాంత్

కోనరావుపేట: మండల తహసీల్దార్‌గా రవికాంత్‌కు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కోనరావుపేట తహసీల్దార్ జక్కని నరేందర్‌ను ఇల్లంతకుంట మండలానికి బదిలీ చేస్తూ, ఇల్లంతకుంట తహసీల్ కార్యాలయంలో పనిచేస్తున్న రవికాంత్‌ను కోనరావుపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏళ్లుగా ఎదురుచూపు

- అరకొర నిధులతో అసంపూర్తిగా నిర్మాణం
- మహిళా సంఘ భవనం పూర్తయ్యేదెన్నడో.?
- పొదుపు సమావేశాల నిర్వహణకు ఇబ్బంది
- పట్టించుకోని పాలకులు



అసంపూర్తిగా మహిళా సంఘం భవనం

సిరిసిల్లఅర్బన్: మున్సిపల్ పరిధిలోని పెద్దబోనాలలో మహిళా సంఘం భవన నిర్మాణం అరకొర నిధుల మూలంగా అర్ధాంతరంగా ఆగిపోయింది. సంఘాల అభ్యున్నతికి పొదుపు సమావేశాలు, నెలవారీ సమావేశాలు నిర్వహించేందుకు మహిళా సంఘం భవనానికి ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. నిధుల కొరత మూలంగా భవన నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో సమావేశాలను నిర్వహించేందుకు సరైన స్థలం, సౌకర్యాలు లేక మహిళలు ఇబ్బందిపడుతున్నారు.

ఏళ్లుగా నిరీక్షణ

పెద్ద బోనాల పరిధిలో 18 మహిళా సంఘాల గ్రూపులు ఉన్నాయి. వాటిలో దాదాపు 200 మంది పైచిలుకు సంఘం సభ్యులు ఉన్నారు. మహిళా సంఘం సభ్యులు ప్రతినెల సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు దాదాపు 8 ఏళ్ల క్రితం అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ కంఠం భూమిలో భవన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. మొదటి విడత ప్రభుత్వం రూ.2 లక్షలు కేటాయించింది. కాంట్రాక్టర్ నిర్మాణ పనులను చకచకా ప్రారంభించి శ్లాబ్ పోసి వదిలిపెట్టారు. అనంతరం నిధులు మంజూరు కాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు.

మున్సిపల్‌లో విలీనంతో..

ఐదేళ్ల క్రితం సిరిసిల్ల సమీప గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయడంతో మహిళా సంఘాలను ఐకేపీ నుంచి మెప్మాలో కలిపారు. దీంతో మహిళా సంఘం భవనాన్ని పట్టించుకునేవారు కరువయ్యారని మహిళ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏళ్ల నుంచి భవన నిర్మాణం కొరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించిందని మహిళా సంఘాలు అన్నాయి.

చెట్ల కింద సమావేశాలు

ప్రతి నెల మహిళా సంఘం సభ్యులు సమావేశాలను నిర్వహించేందుకు సరైన స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. చెట్ల కింద, అప్పడప్పుడు వార్డు కార్యాలయంలో, ప్రైవేట్ స్థలాల్లో, ఇళ్లలో నిర్వహిస్తున్నారు. వేసవి, వర్షాకాలాల్లో మరింత ఇబ్బందవుతున్నట్లు తెలిపారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి సామగ్రిని నిలువ ఉంచేందుకు సరైన స్థలం లేదని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణానికి కృషి చేయాలని వేడుకుంటున్నారు.

ఇబ్బందిగా ఉంది



భవనం నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి నెల సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. మహిళా సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. గన్నీ సంచులు, టార్పలిన్ కవర్లు. సుతిలీ, తదితర సామగ్రిని పెట్టేందుకు కూడా స్థలం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

– బైరగోని రేణుక, మహిళ సంఘం అధ్యక్షురాలు

భవన నిర్మాణం చేపట్టాలి



మహిళా సంఘ సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బంది అవుతోంది. ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టాలి. దీనికొరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. దాదాపు 200 మంది సభ్యులు ప్రతి నెల సమావేశాలు జరిపేందుకు సమస్యగా మారింది.

– కాంభోజు పుష్పలత, మహిళా సంఘం సభ్యురాలు

బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అనుసరిస్తున్న విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న జరిగే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అప్రజాస్వామికం

తంగళ్లపల్లి: ముందస్తు అరెస్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన మండల కాంగ్రెస్ నాయకులను బుధవారం పరామర్శించి మాట్లాడారు. కేటీఆర్ పర్యటన ఉన్న ప్రతిసారి కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం సరికాదని ఖండించారు.

వైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలంలో మరిమడ్లలో చల్మెడ ఆస్పత్రి కరీంనగర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య సర్వే

మండలంలోని ధర్మారం, రాజన్న గొల్లపల్లి(కొలనూర్) గ్రామాల్లో చల్మెడ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు.

మిషన్ వాత్సల్య పథకం సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పథకం ప్రధాన కార్యదర్శి సుంకి భాస్కర్, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ అన్నారు.

కంటి వెలుగు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఉరడి రాంరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

ఇల్లంతకుంట: ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బొప్ప నరేశ్, పసుల మల్లేశం కుటుంబ సభ్యులను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పరామర్శించారు. సర్పంచ్ జితేందర్, నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని సహకార సంఘం ద్వారా 35 మంది రైతులకు ఒక కోటి పన్నెండు లక్షల రూ.25 వేల రుణాల చెక్కులను సింగిల్ విండో చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఈవో రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు లచ్చయ్య, సృజన్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరండి

వేములవాడరూరల్/వీర్నపల్లి/గంభీరావుపేట/చందుర్తి: ఈనెల 14 న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మంచిర్యాలలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్, భూత శ్రీనివాస్, హమీద్, చింతపంటి రామస్వామి కోరారు. సీఎల్‌పీ నేత బట్టి విక్రమార్క పాదయాత్ర పురస్కరించుకుని జరిగే ఈ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్ హాజరవుతున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో ఇంటింటికి సీపీఐ పోస్టర్‌ను సీపీఐ జిల్లా నాయకులు మీసం లక్ష్మణ్ ఆవిష్కరించారు ఈ నెల 22న బోయినపల్లి మండల కేంద్రంలో నిర్వహించే పోరుజాతను విజయవంతం చేయాలని కోరారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు, భుక్య తండా, బాబాయిచెఱువు తండా గ్రామాలలో ఎంపీటీసీ అరుణ్ కుమార్, సర్పంచులతో కలిసి బుధవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు.